

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

## – డా. నందమూరి లక్ష్మీపార్వతి



*డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం* **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు – భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** *నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు - కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!*

*(గత సంచిక తరువాయి)*

## ప్రత్యేక ఇంటర్వ్యూలు

***(డా.ఎన్.టి.ఆర్ గారితో*** *సాన్నిహిత్యం కలిగి, వారితోపాటు చిత్రరంగంలో కృషి చేసిన ప్రముఖులతో ముఖాముఖీలు ఈ పరిశోధనా కార్యక్రమంలోని క్షేత్రపర్యటన సందర్భంగా సేకరించినవి)*

### శ్రీమతి బి.అంజలిదేవి

### సుప్రసిద్ధ సినీనటి, నిర్మాత.

**"నాకు మొదట** పల్లెటూరి పిల్లతో పరిచయమయ్యారు. యల్.వి.ప్రసాద్‌గారి పిక్చర్‌లో సబ్‌ఇన్స్‌పెక్టర్ కారెక్టరు వేశారు. పల్లెటూరిపిల్ల తాపీధర్మారావుగారి కథ. నేను జయంతి కారెక్టర్ వెయ్యాలని కోరారు. కొత్తనటుడు చాలా బాగున్నాడని చెప్పారు. వీరు చూస్తే పెద్ద హైట్. కొట్టమంటారు డైరెక్టర్. చిన్నగా ఇలా అనేదాన్ని. బి.ఏ సుబ్బారావుగారు గట్టిగా కొట్టమన్నారు. మొత్తానికి చాలా టేకులయ్యాక, ఒక టేకులో బాగా కొట్టాను. ఫర్వాలేదండీ అన్నారు. గొప్పాయన ఎట్లా కొట్టాలా అని చాలా బాధపడ్డాను. కానీ ఆయన ధైర్యం చెప్పారు.

అదయిన తరువాత "చరణదాసి" రామారావుగారు, నాగేశ్వరరావుగారు అందరూ ఉన్నారు. లవకుశ తీసిన శంకరరెడ్డిగారు నిర్మాతలు. అందులో ఒక డ్రామా వస్తుంది. అందులో వారు రాముడుగా, నేను సీతగా నటించాను. అది చాలా బాగా వచ్చింది. శంకరరెడ్డిగారి మనస్సులో అది మిగిలిపోయింది. అందుకే లవకుశ తీసారు. సి. పుల్లయ్యగారి దర్శకత్వం.

సీతను అడవికి పంపేముందు పతియొక్క అనుజ్ఞ తీసుకోవాలి కదా. చప్పుడు చేయకుండా వెళ్ళాలి. షాట్ తీసే ముందు వారు రాముడిగా సెట్‌లోకి వచ్చారు. వారిని అలాగే చూస్తుండిపోయాను. నిజమైన రాముడు వచ్చాడని అనిపించింది. ఆ పాత్రలో ఇన్‌వాల్వ్ అవటం, మేకప్ వేసుకునేటప్పుడే ఆ పాత్రలైపోతాం. రాముడంటే రాముడే, రామారావుగారు కాదు, సీత అంటే అంజలికాదు. ఆ పిక్చరు ఏడు సంవత్సరాలు తీసినా, లవకుశులు కూడా పెద్దవాళ్ళైపోయారు. అయినా నభూతో నభవిష్యతి. ఎక్కడకు వెళ్ళినా సీతమ్మ అంటారు. హిందూపూర్‌లో ఏదో ఒక సన్మానానికి వెళ్ళాను. ఆడవాళ్ళంతా దారి కాచి దణ్ణాలు పెట్టటం మర్చిపోలేను. ఆర్టిస్ట్‌కు ఆ గౌరవం కలగటం నిజంగా అదృష్టం.. అసలు అలా వేయగలిగిన వాళ్ళు ఎవరున్నారు. ఆ ముఖకవళికలు, ఎవరికి వస్తాయి. అలాగే రుక్మిణి పాత్రకూడా. కృష్ణుడంటే ఎక్కువ సత్యభామతో ఉండేది. ఆ వేషం వేసినా అలాగే చూస్తుండేవాళ్ళం. అన్నిటికంటే నా అనుభవంలో పి.పుల్లయ్యగారు 'వేంకటేశ్వర మహాత్మ్యం' తీసారు. వారిని మావయ్య, శాంతమ్మగారిని అత్తయ్య అనేదాన్ని. ఆ విగ్రహంలో నుండి రామారావుగారు బైటకి రావటం ఎప్పటికీ మర్చిపోలేను. ఆ షాట్ ఎంత గొప్పగా వచ్చిందో యాజ్ ఏ ఆర్టిస్ట్‌గా నేను అందులో నటించకపోయినా నా మనసులో కళ్ళల్లో మిగిలిపోయిన దృశ్యం అది. నేను అత్యంత అనుభూతి పొందిన సినిమా అది. ఆయన డ్యూటీమైండ్ టైమంటే టైమ్. నేను, నాగేశ్వరరావుగారు, రామారావుగారు టైమంటే టైమ్. ఇప్పుడవేమీ లేవు. ఏమిటి తీస్తున్నారు. డైలాగ్స్ ఏమిటి, ముందు అవి చూసేవాళ్ళం. ఒక అండర్‌స్టాండింగ్ అందరికీ ఉండేది. ఆ రోజుల్లో డబ్బు మాటేలేదు. దానికోసం కాదు. నెలజీతాల మీద పనిచేసేవాళ్ళం. ఏమి తింటున్నామో ఏమీ పట్టేదికాదు. మేకప్ వేసుకోగానే అన్నీ మర్చిపోయేవాళ్ళం. ఆర్టిస్ట్ అన్న తర్వాత ఏ పాత్రయినా వేయాలి. ఎంతసేపూ ఆ షాట్, పాత్రలు, అదయినాక మరొకటి.

ఆయనకు ఎంతో గౌరవం, తోటి ఆర్టిస్టులంటే... మిమ్మల్ని పెళ్ళిచేసుకోవటం మాకు ఆశ్చర్యం. ఎందుకంటే ఆయన ఇతర స్త్రీల పట్ల చాలా గంభీరంగా ఉండేవారు. ఆఖరుకు డ్రైవరుని కూడా గారూ అని, అందరినీ గారూ అని పిలిచేవారు. శ్రీరామపట్టాభిషేకంలో శబరిగా, శ్రీనివాస కళ్యాణంలో 'వకుళ'గా వేసాను. ఎన్.ఎ.టి సంస్థలో కూడా చాలా పిక్చర్స్ చేశాను. ఆ సంస్థను వారి తమ్ముడిగారు చూసేవారు.

మీరు తలపెట్టింది చాలా పవిత్రమైన భావంతో, ఇది మంచి వర్క్. బాగా చెయ్యాలని కోరుకుంటున్నాను."

## శ్రీమతి దేవిక

## సుప్రసిద్ధ సినీనటి

**"వారితో** నా మొదటి పిక్చరు రేచుక్క. పెద్ద పాపులర్ హీరోగా ఉన్నవారితో నాకు యాక్ట్ చేయాలంటే భయంగా ఉండేది. మైథలాజికల్ పిక్చర్స్‌లో లక్ష్మిగా, రుక్మిణిగా వేశాను. వారికి సైలెంట్‌గా ఉండటం ఇష్టం. నేను కూడా కామ్‌గా ఉండేదాన్ని. అందుకే వారు నన్ను అభిమానించేవారు. అహర్నిశలు ఇల్లు, షూటింగ్. ఔట్‌డోర్ షూటింగులు కూడా ఇష్టపడేవారు కాదు. ఎందుకండి దండగ అనేవారు. ఆయన తెల్లవారుఝూమున యోగా చేసి టైమ్‌కల్లా షూటింగ్‌కి వచ్చేవారు. కఠిన పరిశ్రమ చేసేవారు. ఆయన రాత్రింబవళ్ళు పనిచేసేవారు. మాములు మనిషి కాదనిపించింది. బొబ్బిలిపులి, సర్దార్‌పాపారాయుడు, ఆ వయస్సులో కూడా అలాంటి పాత్రలు వేసి మెప్పించారు. రామారావుగారంటే మంచి గ్లామర్ హీరోగా పాతాళభైరవినుండి పరిచయమయ్యారు. రాముడుగా, కృష్ణుడుగా ఇక ఎవ్వరు చెయ్యలేరు. ఇంతవరకు పుట్టలేదు కూడా. తమిళంలోకాని, హిందీలో కాని, కన్నడంలో కాని ఎవరూ పుట్టలేదు. లవకుశలో వారి రాముడు వేషం చూస్తుంటే రవివర్మ పెయింటింగ్‌లో లాగా ఉంటుంది. ఇప్పుడు కూడా ఏడుస్తుంటాను ఆ పిక్చరు చూస్తే. రాముడికి ఇన్ని కష్టాలా. ఇంత

మహానుభావుడికా అనిపిస్తుంది. ఆయన కృష్ణుడు పాత్ర వేసినప్పుడు చాలా నియమాలు పాటించేవారు. పళ్ళు, పాలు మాత్రమే తీసుకునేవారు. బరువైన కిరీటం తియ్యకుండా పెట్టుకునేవారు. దాన్ని మోయటం ఒక పవిత్రంగా రాముడినో కృష్ణుడినో మోస్తున్నట్లు ఫీలయ్యేవారు. అంతభక్తిగా ప్రతి వేషాన్ని వేసేవారు. ప్రతి శనివారం ఉపవాసం ఉండి నేలమీద పడుకునేవారు. ఇంద్రియాల్ని తన కంట్రోల్లో పెట్టుకున్న మనిషిని ఆయనలాగా చూడలేం. నియమబద్ధమైన జీవితం. కామ్‌గా ఉండేవారిని ఆయన బాగా లైక్ చేసేవారు. పేకాట ఆడుతుండేవారు చాలామంది. నాలాగా ఆడకుండా ఉండేవాళ్ళంటే ఇష్టపడేవారు. విశ్వామిత్రలో మా పాపను బాగా పలకరించారు. మా పాపకు బాగా ఇష్టం వారంటే.

శివాజీగారు, ఎం.జి.ఆర్.గారితో హిందీలో అశోక్‌గారితోను యాక్ట్ చేసాను. కానీ రామారావుగారితో నటించింది ఒక అనుభూతి. ఆయన మంచి టేస్ట్ ఉన్నవారు. బొట్టు తీర్చి దిద్దుకోవటంలో కూడా ఒక ప్రత్యేకత ఉండేది. ఆయన దర్శకత్వం వహించారు. అంతశక్తి మరేమనిషిలో లేదు. ఆయన మళ్ళీ రావాలని కోరుకుంటున్నాను.

చిన్న పిల్లనవ్వటం మూలాన సీత పాత్ర వేయలేకపోయా. కానీ ఆ పాత్ర అంజమ్మగారు చేసినట్లు ఎవరూ చేయలేరు. ఆ అనుభవం లేదు. శ్రీకృష్ణావతారంలో లక్ష్మిగా, రుక్మిణిగా వేసాను. పాటలో వారివైపు చూస్తూ డైలాగ్స్ మర్చిపోయాను. సాంఘిక పిక్చర్స్‌లో ఎన్నో నటించాం. కానీ రాముడు, కృష్ణుడు పాత్రలు వేస్తే భిన్నంగా ఉండేవారు. ఎంతో బాలన్స్ కనిపించేది. చూపు, నడక అన్నీ పద్ధతిగా ఉండేవి. వారి పక్కన రుక్మిణీ వేయటం చాలా అదృష్టంగ భావిస్తుంటాను. చివరలో విశ్వామిత్ర. మా పాప నటించటం ద్వారా మళ్ళీ కలుసుకోగలిగారు. లేకపోతే అది కూడా మిస్సై ఉండేదాన్ని. పైగా వారు వేసుకున్న పురాణ పాత్రల డ్రస్సులు తనే స్వయంగా చూసుకునేవారు. ప్రతిదీ తనే చూసుకునేవారు. అటువంటి పద్ధతి ఎవరికీ రాదు, రాలేదు."

## శ్రీమతి వాణిశ్రీ

## సుప్రసిద్ధ సినీనటి

"ఎన్.టి.ఆర్ గారి పౌరాణిక పాత్రలన్నీ నాకు ఇష్టమైనవే. వారితో నటించేప్పుడు ఒళ్ళు దగ్గరపెట్టుకుని జాగ్రత్తగా డైలాగ్స్ కాని, నటన కాని చేసేదాన్ని. వారితో సినిమా అంటే నాకు భయం, ముందు బాగా ప్రిపేరై వెళ్ళేదాన్ని. రామారావుగారితో చిన్న వేషాలతో ప్రారంభించాను. అయినప్పటికీ సమానస్థాయిలో ఆదరించారు. వారిది చాలాగొప్ప మనసు. మీరు అని గౌరవించేవారు. కొంతమంది మాట్లాడడం ద్వారా మరికొంతమంది మాట్లాడకపోవడం ద్వారా గౌరవం వస్తుంది. ఆయన స్త్రీలపట్ల చూపే గౌరవం చాలా గొప్పది. రామారావుగారి వ్యక్తిత్వం మహోన్నతమైంది. వారిలో దైవత్వం ఉంది. అందుకే రాముడు, కృష్ణుడు పాత్రలకు వారే సరిపోయారు. పూర్వజన్మ సుకృతం వారి రూపం"

*( ముగింపు వచ్చేనెలలో)*

Post your comments